# ఒకరికి ఖేదం........

"ఒరే గోవిందు....గోవిందూ" పెద్దగా పిలుస్తూ తట్టిలేపాడు రామకృష్ణ.

"వూ ..." బద్దకంగా మూలిగాడు గోవిందు.

"లేరా ముండా .. పొద్దెక్కింది" విసురుగాఅన్నాడు రామకృష్ణ.

తప్పదన్నట్లు లేచి, కళ్లు నలుచుకుంటూ కూర్చున్నాడు గోవిందు. చిన్నగా తుంపర పడుతున్నది. ఈదురు గాలికి వణుకు పెడుతున్నది. అయినా తప్పేది కాదు కాబట్టి మొండిగా లేచి నిల్చుని దుప్పటి మడత పెట్టాడు. చాప చుట్టి మూలన పెట్టాడు. ఓ సారి పెద్దగా ఆవలించాడు. నిద్ర బద్ధకం వదల్లేదు వాడికి.

నోట్లో వేపపుల్ల పెట్టుకుని పెద్ద రేకుట్రేలో ఖాళీ పాలసీసాల్ని వరుసగా అమరుస్తున్నాడు. మధ్య మధ్యలో యజమాని తొందర చేస్తుంటే విసుగనిపించింది వాడికి.

వాడు అమర్చిన సీసాల్లో పాలుపోసి మూతలు బిగించాడు రామకృష్ణ.

నిండు సీసాల్ని రెండు పెద్ద సంచుల్లో పొందికగా అమర్చుకున్నాడు. అరలు అరలుగా తయారు చేసిన చెక్కపెట్టెలో కూడా

సీసాలు పెట్టుకున్నాడు గోవిందు.

నోట్లో వున్న పుల్లని పారేసి దోసెడు నీళ్ళతో ముఖం కడుక్కుని గోడపక్కనున్న సైకిల్ తీసి బయట పెట్టుకున్నాడు. రెండు సంచుల్ని హేండిల్‌కు రెండువైపులా తగిలించాడు. చెక్క పెట్టెను వెనక క్యారేజి పైన పెట్టి, పాత ట్యూబుతో గట్టిగా లాగిబిగించాడు.

తుండుగుడ్డ తీసుకుని తలకు చుట్టుకున్నాడు. పొడుగు చేతుల చొక్కా తొడుక్కుంటూ యజమాని ఒంటిమీద వున్న చలికోటు వంక అసూయగా చూశాడు.

"పద, పద"మంటూ తొందర చేశాడు రామకృష్ణ.

సైకిల్ స్టాండు తీసి ఇంటిముందున్న బండమీద నుంచి సీటు పైన కూర్చుని అందీ అందని పెడల్స్‌ను తొక్కుతూ బయల్దేరాడు గోవిందు. రెండో రౌండుకు సీసాలు సిద్ధం చేయటం ప్రారంభించాడు రామకృష్ణ.

★ ★ ★

టౌనుకు ప్రత్యేకంగా వుండే ఓ ప్రాంతంలో పాల వ్యాపారం ప్రారంభించాడు రామకృష్ణ. చుట్టుపక్కలవున్న పల్లెల నుంచి పాలు తెచ్చి సీసాలలో ఇళ్ళకి పంపించటం రామకృష్ణ వ్యాపారం.రోజులో ఏ టైములో అయినా అతని దగ్గర పాలు దొరుకుతయ్. సర్కారు వారి పాల పేకెట్ల ధరకంటే తక్కువకే అతను పాలు సరఫరా చేస్తున్నాడు. ఆ ప్రాంతంలో అతని కున్న పరిచయాల వల్లనయితేనేం, తక్కువ ధరకే పాలు విక్రయిస్తుండటం వల్లకానీ, అప్పుకు అవకాశం వుండటం వల్లనయితేనేం, అతని వ్యాపారం చక్కగా సజావుగా సాగి

పోతోంది. పల్లెల్నించి పాలు తీసుకు వస్తుంటాడు రామ(క్రిష్ణ. చాలా కాలం నుంచి అతని దగ్గర పనిచేస్తున్నాడు పదమూడేళ్ళ గోవిందు. వాడి తిండి కూడా రోజూ రామ(క్రిష్ణ ఇంట్లోనే. అక్కడేపడుకుంటాడు

ఖాతాదారుల ఇళ్ళముందర ఆగి సైకిల్ స్టాండు వేసుకోవడం కాలింగ్ బెల్ కొట్టడమో, గేటు చప్పుడు చేయడమో చేస్తుంటాడు గోవిందు. నిద్రమత్తులో బద్ధకంగా తలుపులు తెరుచుకుని పాత్రలు చేత పట్టుకుని వస్తారు. వారికి పాలు అందించి మరో ఇంటికి బయల్దే రుతాడు గోవిందు. ఒక్కొక్క ఇంటిముందయితే వాడు చాలాసేపు నిల్చోవలసి వస్తుంది. అప్పుడప్పుడు విసుగనిపించి వారికోసం వేచి వుండకుండా వెళ్ళిపోతాడు వాడు. ఆ తర్వాత వారే రామ(క్రిష్ణ షాపు దగ్గరకు వెళ్ళి పాలు పోయించుకుని వెళుతుంటారు. అలా ఖాతా దారులకు అసౌకర్యం కలిగించినందుకు యజమాని తనను ఏమీ అన డనే ధైర్యం వున్నది గోవిందుకు. రెండు, మూడు సార్లు అలా చేస్తే గాని వాళ్లు సమయానికి తలుపులు తెరవరని వాడి నమ్మకం.

రోజూ లాగానే పాలసీసాల్తో సైకిల్ యాత్ర ప్రారంభించిన గోవిందు, ఓ డజను ఇళ్ళకు పాలుఅందించి మరోవీధికి వెళ్తున్నాడు.

అసలే చలికాలం. దానికి తోడు వాయుగుండం కారణంగా వీస్తున్న ఈదుడుగాలి. ఒక దానికి ఒకటి తోడై ఎముకలు కొరికేస్తు న్నయ్. చేతులు ఒణికిపోతున్నయ్ చలికి. హేండిల్ అటు యిటు వూగిపోతున్నది. పెడల్ కాలికి అందినప్పుడల్లా బలంగా నొక్కుతు న్నాడు. అప్పుడే అనుకోకుండా ప్రమాదం జరిగిపోయింది. సరిగ్గాఆ వీధి మలుపు తిరుగుతుండగా అటువైపునుంచి వస్తున్న స్కూటర్ వాలాను గుద్దేశాడు గోవిందు. పాలసీసాలన్నీ ముక్కలు ముక్కలై

చెల్లాచెదరుగా రోడ్డు నాక్రమించుకున్నయ్. సైకిల్ ఒక వైపుకు వాడొక వైపుకు పడిపోయారు. అయితే అదృష్టవశాత్తు గోవిందుకు ప్రమాదం ఏవి జరగలేదు నాలుగయిదు చోట్ల చిన్న చిన్న దెబ్బల్తో కనపడని నొప్పితో బయటపడ్డాడు వాడు. దెబ్బలకన్నా, నొప్పుల కన్నా, యజమాని కొడతాడేమోనన్న భయం వాడ్ని ఏడిపించింది. అప్పటికే రోడ్డుమీదకు వచ్చిన జనం అక్కడికి చేరారు. వాడి ఏడుపు విని మరికొందరు ఇళ్ళల్లోంచి బయటకు వచ్చారు. ఆ వార్త రామక్రిష్ణకు చేరింది. వెంటనే ఆ ప్రదేశానికి వచ్చాడతడు. పాపం వాడిమీద సానుభూతితో అక్కడున్న వారంతా వాడి తప్పేం లేదనే చెప్పారు. స్కూటర్ వాలా అక్కడ ఆగకుండానే వెళ్ళిపోయాడన్న విషయం ఎవరూ మాట్లాడుకోవటం లేదు.

అంతమందిలోనూ వాడ్ని ఏమీ అనటం ఇష్టం లేకపోయింది రామక్రిష్ణకు. రోడ్డు మీద పడిన సీసా పెంకుల్ని ఓ పక్కకుతోస్తూ, భయంగా యజమాని వంక చూస్తున్నాడు గోవిందు.

"ఆ మూతలన్నీ ఏరుకుని వచ్చెయ్" అంటూ సైకిల్ తను తీసుకుని వెళ్ళాడు రామక్రిష్ణ. ఆ రోజు రెండో రౌండ్‌కు వెళ్ళలేదు గోవిందు. 'పాలెందుకు రాలేదు' అనుకుంటూ ఒక్కొక్కరే పాత్రలు పట్టుకుని షాపు దగ్గరకు రావడం మొదలు పెట్టారు. వచ్చిన ప్రతి వాళ్ళతోనూ జరిగిన విషయాన్ని క్లుప్తంగా చెప్తూ, పాలుపోసి పంపు తున్నాడు రామక్రిష్ణ. ఓ పక్కగా తలొంచు కూర్చున్నాడు గోవిందు.

అందర్తో, తనేదో నేరం చేసినట్లుగా యజమాని చెప్పడం, మధ్య మధ్యలో తనని తిట్టడం నచ్చలేదు గోవిందుకు. అప్పటికే ఓసారి నోరువిప్పి నాలుగు తన్నులు తినటంతో మళ్ళీ ఆ ప్రయత్నం చేయకుండా మౌనంగా రోదిస్తూ కూర్చున్నాడు వాడు.

అతను కొట్టినా, తిట్టినా కూడా పరవాలేదు. కాని పన్లో నుంచి తీసెయ్యకుండా వుంటేచాలు, అదే పదివేలు. అదే కోరుకుంటున్నాడు గోవిందు మనసులో.

అప్పటికిక వాడికి ఇంకేం పనిలేకపోవటంతో మెల్లగా రోడ్డు మీదకి వచ్చాడు. ఎందుకో ఒకసారి అలా ఇందాక వాడు సైకిల్ మీద నుండి పడిన చోటుకి వెళ్ళాలనిపించింది గోవిందుకు.

నిర్లిప్తంగా అడుగులు వేసుకుంటూ నడిచాడు. సరిగ్గా వాడు ఆ సందు మలుపు తిరుగుతుండగా వాడికి అభిముఖంగా ఇద్దరు పిల్లలు సంబరంగా, ఆ సీసా పెంకుల కుప్పవైపు పరుగులు తీస్తు న్నారు. ఆ ఇద్దరి భుజాల మీదుగా చెరో గోనె సంచీ వేలాడు తున్నది.

వారి ముఖంలో కోటి దీపాల కాంతి.

వారి వెనగ్గా వెళ్ళి నించున్నాడు గోవిందు మౌనంగా.

"ఓరీ ఈ రోజు సిన్మాకెళ్లాల్సిందే" సంతోషంగా అన్నాడు ఆ ఇద్దర్లో ఒకడు.

"అలాగే" అన్నట్టు గట్టిగా తలాడించేసి ఓ ఈల వేసాడు రెండోవాడు.

ఆ ఇద్దరి సంతోషం చూసిన గోవిందుకు, ఎందుకో వాడికి తెలియకుండానే వాడిలోని దిగులు, బాధ మాయం అయిపోయినై. ఏదో వింత తృప్తి వాడిలో ప్రవేశించింది.

ఆత్రంగా, ఆబగా అక్కడున్న సీసా పెంకులన్నింటినీ గోతాల్లో వేసుకుని ఆ ఇద్దరూ సంబరంగా వెళ్ళిపోయారు అక్కడ్నుంచి.

ఆదివారం నవంబర్ 24, 1991